క్లుప్తంగా

చీరల పంపిణీ



అడ్డాకుల: మండల కేంద్రంలోని ఎంబీ చర్చిలో క్రిస్మస్‌ను పురస్కరించుకుని ఆదివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు చీరలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సూచనతో వృద్ధులు, వితంతువులకు కాంగ్రెస్ నాయకుడు ఖాజామైనోద్దీన్ సొంత డబ్బులతో చీరలను పంపిణీ చేశారు. నిరుపేదలు పండుగను సంతోషంగా చేసుకోవాలనే చీరలను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి విజయమోహన్‌రెడ్డి, భీమన్నయాదవ్, సయ్యద్‌షఫి, విట్టాబాబు, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నిరంజన్, నవీన్, రాములు తదితరులు ఉన్నారు.

జాతీయ రహదారిపై గుర్రాల పట్టివేత

జడ్చర్ల: జాతీయ రహదారులపై గుర్రాల పరుగు పందెం నిర్వహించడం చట్టవిరుద్ధమని సీఐ రమేష్‌బాబు తెలిపారు. ఆదివారం హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వరకు కొందరు యువకులు గుర్రాలపై పరుగు పందెం నిర్వహించినట్లు తెలిపారు. రోడ్లపై వాహనదారులతో పాటు గుర్రాల పరుగు పందెం నిర్వహించే వారు కూడా ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉందన్నారు. రెండు గుర్రాలను, ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

స్కాలర్‌షిప్ విడుదల చేయాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని కోరుతూ ఎమ్మెల్యే ఎన్నం శ్రీనివాస్‌రెడ్డికి ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.7వేల కోట్లకు పైగా పెండింగ్ ఉన్నాయని, చాలా మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌పై ఆధారపడి చదువుతున్నారని, విడుదల చేయకపోవడంతో పైచదువులకు వెళ్లేందుకు వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భరత్, ఈశ్వర్, నందు, రాము, భాను తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించాలి

గండేడ్/మహమ్మదాబాద్: ఏళ్లతరబడి కాంగ్రెస్ పార్టీకి పనిచేసిన కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు ఇవ్వకుండా ఎన్నికల్లో చివరి వరకు బీఆర్ఎస్‌లో పనిచేసిన వారికి పదవులు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని సీనియర్ నాయకులు అనంతలక్ష్మారెడ్డి, ఆశిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, ఎంపీటీసీ బాలయ్య, టీక్యా, పాల్గుణ, ముకుందం, జూలపల్లి నారాయణలు తీవ్ర ఆగ్రహం వ్యక్తపరిచారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా పార్టీలో ఉంటూ ఎన్నో కష్టాలను భరిస్తూ ప్రజలకు సేవ చేసిన కార్యకర్తలను వదిలి, పనిచేయని వారికి పట్టం కట్టడం వల్ల బీసీవర్గ, ఇతర నాయకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. దీంతో రానున్న ఎన్నికల్లో పార్టీకి నష్టం కలుగుతుందని తెలిపారు.

నవాబుపేటలో ట్రాఫిక్ జాం



నవాబుపేట: మండల కేంద్రంలో ఆదివారం ట్రాఫిక్ జాం కావటంతో ప్రయాణికుల ఇబ్బందులు పడ్డారు. మహబూబ్‌నగర్ నుంచి వచ్చే ప్రయాణికులు సంత బజార్‌లో ఎదురెదురుగా వాహనాలు రావటంతో అరగంటకు పైగా ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. ఈ విషయంలో అధికారులు ఆదివారం ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన వన్నం బాలయ్య యాదవ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఆదివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. కాంగ్రెస్ నాయకుడు ఖాజామైనోద్దీన్ కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో విజయమోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలయ్య, రాములు, వేఘనాథ్, నవీన్, నిరంజన్ తదితరులు ఉన్నారు.

రేపు దత్తజయంతి వేడుకలు

నారాయణపేట రూరల్: పట్టణంలోని శ్రీ సద్గురు అవదూత నర్సింహాస్వామి దేవాలయంలో మంగళవారం దత్తజయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం, మహాయజ్ఞం నిర్వహించి భక్తులకు అన్నదానం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.



జడ్చర్లలో విద్యుద్దీపాలతో అలంకరించిన యంబీ బేథని చర్చి



విద్యుత్‌దీపాల వెలుగులో క్రిస్టియన్‌పల్లిలోని చర్చి


క్రిస్మస్‌కు చర్చిలు ముస్తాబు

• కల్వరి ఎంబీ చర్చిలో ప్రత్యేక ఏర్పాట్లు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కల్వరి మెన్నోనైట్ బ్రదరన్ చర్చి (ఎంబీసీ) ఆధ్వర్యంలో సోమవారం క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఉదయం ప్రత్యేక ఆరాధన, భక్తిగీతాల ఆలాపన, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఎంబీ చర్చిలో హైదరాబాద్‌కు చెందిన రెవ.పాస్టర్ జె.చిరంజీవి క్రీస్తు సందేశం ఇవ్వనున్నారు. స్థానిక ఎర్రసత్యం చౌరస్తా సమీపంలోని మెథడిస్ట్ చర్చిను క్రిస్మస్ వేడుకలను సిద్ధం చేశారు. విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. అదేవిధంగా ఏనుగొండలోని రెమా వర్షిప్ చర్చి, కమలా నెహ్రూల కాలనీలోని షాలేం మెన్నోనైట్ బ్రదరన్ చర్చి, మెట్టుగడ్డలోని ఎవాంజిలిస్ట్ చర్చి, క్రిస్టియన్‌కాలనీలోని ఎంబీ ప్రార్థనా మందిరం, క్రిస్టియన్‌పల్లిలోని బెత్లెహాం చర్చితోపాటు ఇతర చర్చిల్లో క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించటానికి ఏర్పాట్లు చేశారు.

సన్నిధి ఆశ్రమ పాఠశాలలో క్రిస్మస్ సంబరాలు..

స్టేషన్ మహబూబ్‌నగర్: బంగారు తెలంగాణ రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్



జడ్చర్లలో క్రీస్తురాజు చర్చి

ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఏనుగొండలోని సన్నిధి ఆశ్రమ పాఠశాలలో క్రిస్మస్ ముందస్తు సంబరాలు చేసుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అన్సార్ హుస్సేన్ ముఖ్య అతిథిగా పాల్గొని పిల్లలతో కలిసి కేక్‌కట్ చేశారు. అనంతరం పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, శివారెడ్డి, చంద్రశేఖర్, మహ్మద్ నయీం, క్రాంతి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధం..

జడ్చర్ల టౌన్: క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని మండలంలోని ప్రార్థనా మందిరాలు విద్యుద్దీపాలతో అలంకరించారు. ఇళ్లపై స్టార్లు వేలాడదీసి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలో యంబీ బేతని చర్చి, జాతీయరహదారిపై కావేరమ్మపేట వద్ద ఉన్న యంబీ సెంటినరీ చర్చి, సిగ్నల్‌గడ్డ క్రీస్తురాజు దేవాలయం, పెంతకోస్ట్ చర్చిలతోపాటు మండలకేంద్రంలోని మరో 14 చర్చిలు, మండలంలోని గంగాపూర్, కొండేడ్, కుర్వగడ్డపల్లి గ్రామాల్లోని చర్చిలను అలంకరించారు. క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని అన్ని చర్చిలలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. యంబి బేథని చర్చిలో వేడుకలలో కడపకు చెందిన రెవ.బాబురావు క్రిస్మస్ సందేశం ఇవ్వనున్నారు. క్రీస్తురాజు దేవాలయంలో ఆదివారం అర్ధరాత్రి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.



క్రిస్టియన్‌పల్లిలో చెట్టుకు స్టార్లతో అలంకరణ



జిల్లా కేంద్రంలోని ఓ దుకాణంలో క్రిస్మస్ స్టార్లు

బలభీమరాయుడి ఉత్సవాలు



భీమరాయ ఆంజనేయస్వామి



ఆలయ ముఖద్వారం, రథం

• చౌదర్‌పల్లిలో కొలువైన దేవుడి జాతరకు వేలాది భక్తులు
• నేటి నుంచి భీమరాయ ఆంజనేయ స్వామి జాతర

మహమ్మదాబాద్: మండలంలోని చౌదర్‌పల్లిలో గల బలభీమరాయ ఆంజనేయస్వామి భక్తికి మారుపేరుగా మహిమగల దేవుడిగా చుట్టూ ఉన్న పల్లె ప్రజలు చెప్పుకుంటారు. కోరికలు నెరవేరితే భక్తులు వెండితో స్వామివారి విగ్రహాలు, గంటలను, పశువులను (కోడెదూడలను) వదిలి తమ మొక్కులు చెల్లించుకుంటారు. చుట్టూ 10గ్రామాల నుంచి భక్తులు ఉత్సవాలకు వచ్చి తమ మొక్కులను చెల్లించుకుంటారు.

పల్లెల్లో పండుగ వాతావరణం..

ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయంటే చుట్టూ ఉన్న గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంటోంది. మండలంలోని మంగంపేట్, నంచర్ల, దేశాయిపల్లి, జగ్గంపల్లి, గాధిర్యాల్, మొకర్లాబాద్ ఇతర తండాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. పూనే, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివస్తారు.

రూ.6కోట్లతో కొత్త ఆలయ నిర్మాణం..

ఆంజనేయస్వామి ఆలయం పురాతనంగా ఉండటంతో ఇదే గ్రామానికి చెందిన సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి (ఎస్ఆర్ఐ) తన కుటుంబసభ్యుల సలహాలతో రూ.6కోట్ల నిధులతో ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. భీమరాయ ఆంజనేయ స్వామి ఆలయంతో పాటు సీతారాముల ఆలయం, మండపం నిర్మాణాలను చేపట్టారు.

రేపటి నుంచి ఉత్సవాలు..

చౌదర్‌పల్లిలో శనివారం నుంచి బలభీమరాయ ఆంజనేయ స్వామి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. 25న సోమవారం ఉదయం అంకురార్పణం, అభిషేకం, తులసి అర్చన, సాయంత్రం శకటోత్సవం (ఎడ్లబండ్లు) మంగళహారతి, 26న మంగళవారం ఉదయం ప్రభాతసేవ, స్వామివారికి మహాభిషేకం, రథోత్సవం మధ్యాహ్నం మంగళహారతి, సాయంత్రం మహా మంగళహారతి, పాండురంగ భజన బండవెల్కిచెర్ల, అభంగపట్నం, దేశాయిపల్లి, నంచర్ల, వారిచే అడుగుల భజన ఇతర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 27న బుధవారం ఉదయం మహాభిషేకం, మంగళహారతి, సహస్రనామ పారాయణం, 28న స్వామివారి అభిషేకం, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం, తీర్థ ప్రసాదాలు, అన్నదానం, సాయంత్రం మంగళహారతి, 29న ఉదయం ప్రత్యేకాభిషేకం, మహా మంగళహారతి, నైవేద్యం, అన్నదానం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

జడ్చర్ల టౌన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఐద్వా నాయకురాలు గీత అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వ్యాపార సంఘ భవనంలో నిర్వహించిన ఐద్వా మండల సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. మహిళా సాధికారత సాధించాలంటే అన్ని రంగాల్లోనూ రాణించాల్సి ఉందన్నారు. ముఖ్యంగా విద్య, ఆర్థిక రంగాల్లో చురుకైన పాత్ర పోషించి సమాజాభివృద్ధికి తోడ్పాటు అందించేలా ప్రతి మహిళా చైతన్యం కావాలన్నారు. ప్రజాసమస్యలపై నిరంతరం కార్యక్రమాలు చేయగలిగినపుడే ప్రజల్లో స్ఫూర్తి



మాట్లాడుతున్న గీత

కలుగుతుందన్నారు. అలాంటప్పుడే మహిళా హక్కులు సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సమావేశంలో భాగంగా 25మందితో మండల కమిటీని ఎన్నుకున్నారు.

రహదారిపై వరుస గుర్తులేవీ?

అడ్డాకుల: 44వ నంబర్ జాతీయ రహదారిపై వరుసలను సూచించే తెలుపు రంగు గుర్తులు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొత్తగా వేసిన బీటీ రెన్యువల్‌పై ఇంకా తెలుపు రంగు వరుసలను ఏర్పాటు చేయకపోవడంతో ద్విచక్రవాహనాలు, ఆటోలు ఇటీవల ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నాయి. జడ్చర్ల నుంచి భూత్పూర్, మూసాపేట, అడ్డాకుల మీదుగా కొత్తకోట వరకు రహదారి నిర్వాహకులు ఇటీవల పాత రోడ్డుపై కొత్తగా బీటీని వేయిస్తున్నారు. ఇందులో భాగంగా భూత్పూర్ మండలంలోని పోతులమడుగు నుంచి మూసాపేట మీదుగా అడ్డాకుల మండలంలోని శాఖాపూర్ టోల్‌ప్లాజా వరకు రెండు వరుసల్లో కొత్తగా బీటీని వేయించారు. రెండు, మూడు నెలల కిందట మొదలైన పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.



వరుస గుర్తులు లేకుండా ఉన్న జాతీయ రహదారి

రాత్రిపూట కష్టాలు..

రహదారి పనులు పూర్తయిన చోట తెలుపు రంగు గుర్తులను ఏర్పాటు చేయకపోవడంతో రాత్రివేళ వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. లైన్ డ్రైవింగ్ చేసే వారు రహదారిపై లైన్లు లేకపోవడంతో వాహనాలను సరిగ్గా అంచనా వేయలేకపోతున్నారు. గత శనివారం కొమిరెడ్డిపల్లి వద్ద ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టి వెళ్లింది. ఇక్కడ లైన్లు లేకపోవడం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. అంతకుముందు రోజు సంకలమద్ది శివారులోని పెట్రోల్ బంకు వద్ద కూడా ఆటో, కారు ప్రమాదానికి గురయ్యాయి. ఈ నేపథ్యంలో రహదారి నిర్వాహకులు స్పందించి బీటీ రెన్యువల్ పనులు పూర్తయిన చోట వెంటనే తెలుపు రంగు లైన్లు ఏర్పాటు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

రాత్రిపూట ఇబ్బందిగా ఉంది..



రహదారిపై కొత్తగా బీటీ రెన్యువల్ పనులు పూర్తయిన చోట ఇంకా తెలుపు రంగు గుర్తులను ఏర్పాటు చేయలేదు. దీని వల్ల రాత్రిపూట ద్విచక్ర వాహనాల రాకను సరిగ్గా అంచనా వేయలేకపోతున్నాం. రాత్రిపూట లైన్లు లేనిచోట డ్రైవింగ్ ఇబ్బందిగా మారుతోంది.

– అబిద్, డీసీఎం డ్రైవర్, మూసాపేట

పశుగ్రాసం దగ్ధం



నవాబుపేట: మండలంలోని పోమాల్ శివారులో ట్రాక్టర్‌పై తరలిస్తున్న పశుగ్రాసం విద్యుదాఘాతంతో దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. ఆదివారం గ్రామం నుంచి రైతు వెంకటయ్య ట్రాక్టర్‌పై పశుగ్రాసాన్ని తరలిస్తుండగా వైర్లు తగిలి గడ్డి మొత్తం తగలబడింది. డ్రైవర్‌తో పాటు అక్కడ ఉన్న వారు అప్రమత్తంకావటంతో ట్రాక్టర్‌ను కాపాడుకోగలిగారు. ఈ ఘటనలో రూ.2లక్షల విలువైన పశుగ్రాసం దగ్ధమైందని తెలిపారు. విద్యుత్ వైర్లు వేలాడం వల్లనే ప్రమాదం చోటు చేసుకుందని చెప్పారు. విషయంపై విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. దీనికి కారణమైన వారిపై చర్య తీసుకుని నష్టపరిహారం చెల్లించి రైతును ఆదుకోవాలని స్థానికులు కోరారు.

విద్యార్థికి అభినందన

ధన్వాడ: జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు మండలంలోని కొండాపూర్ గిరిజన గురుకుల విద్యార్థి సందీప్ ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ రాజారాం తెలిపారు. ఆదివారం గురుకుల పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. ఈ నెల 26నుంచి 30 వరకు ఢిల్లీలో నిర్వహించే 67వ జాతీయస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–19రెజ్లింగ్ పోటీల్లో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గురుకుల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకారంలో ఆంజనేయస్వామి



బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవరకద్ర-కోయిల్‌సాగర్ రోడ్‌లో ఏర్పాటు చేసిన కమాన్

దేవరకదర: చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజువ ధ్వజారోహణంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. పంచామృతాభిషేకం, అలంకరణ, పవమాన హోమం, హనుమాద్ వ్రతం నిర్వహించారు. సోమవారం ఆంజనేయ స్వామి వారికి పంచామృతాభిషేకం, అలంకరణ, రాత్రికి అశ్వవాహన సేవ, తెల్లవారుజామున ప్రభోత్సవం నిర్వహించనున్నారు.

ప్రతి కుటుంబానికి శ్రీరాముడి అక్షతలు



రాజాపూర్‌లో కలశాలతో ఆలయ కమిటీ సభ్యులు

రాజాపూర్: అయోధ్య నుంచి వచ్చిన రామపూజిత అక్షతలు, కరపత్రాలు మండలంలోని ప్రతి కుటుంబానికి చేరవేయాలని బజరంగ్‌దళ్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శివ సీతారామాంజనేయ ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. రాముని విగ్రహ ప్రతిష్ట రోజు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆశీర్వాదం తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సునిల్, కృష్ణయ్య, అచ్చయ్య, జగదీశ్వర్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: ప్రతి ఇంటికి అయోధ్య రామయ్య అక్షతలు అందిస్తామని వీహెచ్‌పీ నాయకులు చందుగుప్త, శివ, మల్లేష్, చంద్రకాంత్, రాఘవేందర్ తెలిపారు. ఆదివారం అయోధ్య నుంచి మండల కేంద్రానికి రామయ్య అక్షతలు చేరాయి. వీటిని సోమవారం అన్ని గ్రామాలకు అందిస్తున్నట్లు వివరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జడ్చర్ల: మండలంలోని దుందుబీ వాగు నుంచి జడ్చర్లకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం గంగాపూర్ వద్ద పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు.

ప్రజలకు సేవకుడిలా పనిచేస్తా

స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ అంటే ప్రేమ, ఆప్యాయతకు ప్రతిరూపమని, ఇక్కడ అన్ని మతాల వారు త్రివేణి సంగమంలా కలిసిమెలిసి జీవిస్తారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంబీసీ మైదానంలో ఆదివారం ప్రభుత్వం తరపున నిరుపేద క్రైస్తవులకు దుస్తుల పంపిణీ, విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా ఎంబీసీ చైర్మన్, పాస్టర్ ఎస్.వరప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే తదితరులు కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో బీఐ.జేకబ్, జేఐ.డేవిడ్, టీఏ.స్టీఫెన్, డానియల్ సుధీర్, కౌన్సిలర్ గోవిందు, వినోద్ కుమార్, దాసరి సుందర్, టైటస్ రాజేందర్, బండ సునీల్, దాసరి సామ్యేల్, కన్నా, సుజయ్, ప్రశాంత్, చిన్నరాజు, ప్రవీణ్ కుమార్, సిరాజ్ ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు మల్లికార్జున్..

తొలి తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన పోరాట యోధుడు మాజీ కేంద్రమంత్రి మల్లికార్జున్ అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం మాజీ కేంద్రమంత్రి మల్లికార్జున్ వర్ధంతి నిర్వహించారు. పద్మావతీకాలనీలో విగ్రహానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, మల్లికార్జున్ భార్య భాగ్యలక్ష్మి, కుమారుడు మను, ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొడంగల్‌ను మహబూబ్‌నగర్‌లో కలపాలి..

మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీగా, కేంద్రమంత్రిగా జిల్లా అభివృద్ధికి మల్లికార్జున్ ఎంతో పాటుపడ్డారని తెలిపారు. కొడంగల్‌ను



క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్‌లో కలపాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. మల్లికార్జున్ భార్య, కుమారుడు మాట్లాడుతూ మల్లికార్జున్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టుల సేవ గొప్పది..

హన్వాడ: జర్నలిస్టులు చేసే సమాజసేవ చలా గొప్పదని, సమాజాన్ని ప్రభావితం చేసే ప్రధాన పాత్రలో జర్నలిస్టులు ఉన్నారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యేను స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తానని ఈసందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

సంక్షేమ పథకాలు అందరికీ అందాలి..

ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందరికీ అందించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసం కలిసిరావాలి..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రజల సంక్షేమం కోసం అందరూ కలిసి రావాలని పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఆదివారం సీపీఎం పార్టీ జిల్లా కార్యాలయంలో సన్మాన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, ప్రజల సమస్యలు పరిష్కరించి, అభివృద్ధిలో ముందుకు పోదామన్నారు.

అందరిపై అమ్మవారి చల్లని చూపు..

మారెమ్మ అమ్మవారి చల్లనిచూపు అందరిపై ఉంటుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 15వ వార్డు పరిధిలోని పూజారితండాలో నిర్వహించిన బోనాల పండుగలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.